క్లుప్తంగా

ఇంక్రిమెంట్లు ఇవ్వాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇతర ప్రభుత్వ బ్యాంకులతో సమానంగా కంప్యూటర్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని భారతీయ మజ్దూర్ సంఘ్ వైస్ ప్రెసిడెంట్ వెంగల్‌రెడ్డి సూచించారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ విషయమై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇప్పటికే తొమ్మిది గ్రామీణ బ్యాంకులు అమలు చేసినా ఏపీజీబీ యాజమాన్యం మాట దాటవేస్తోందన్నారు. ఈ విషయంపై బీఎంఎస్ యూనియన్ తరుపున కెనరా బ్యాంకు ఈడీకి, నాబార్డు చైర్మన్‌కు, ఫైనాన్స్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లామన్నారు.

1 నుంచి యోగా శిక్షణ

కడప కల్చరల్ : స్థానిక పటేల్ రోడ్డులోని మిత్ర యోగా సెంటర్‌లో నవంబరు 1వ తేదీ నుంచి యోగా శిక్షణా శిబిరాన్ని నిర్వహించనున్నట్లు యోగా నిపుణులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, యోగా థెరపిస్టు కె.కల్పన తెలిపారు. వారు మాట్లాడుతూ రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి, మానసిక ఒత్తిడి తగ్గించుకోవడానికి, అధిక బీపీ, డయాబెటిస్, ఒబెసిటీ సమస్యల నివారణకు, ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుకోవడానికి అవసరమైన యోగాసనాలు, ప్రాణాయామం, సూర్యనమస్కారాలు, షట్ క్రియలు, ధ్యానం, యోగ ప్రక్రియలను శాస్త్రీయంగా సాధన చేయిస్తామన్నారు. ఉదయం 6.00 గంటల నుంచి 7.15 గంటల వరకు తొలి బ్యాచ్, 8.30 గంటల నుంచి 10 గంటల వరకు మహిళలకు రెండో బ్యాచ్ ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 9848861206, 7013238986 నెంబర్లను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

పేదలకు అన్నదానం



అనాథలకు అన్నదానం చేస్తున్న ప్రకాశ్

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప నగరానికి చెందిన అమృతవల్లి ప్రకాశ్ నగరంలోని పలు కూడళ్లలో పేదలకు ఆదివారం అన్నదానం చేశారు. రోజూ కొంతమందికి అన్నదానం చేయాలనే ఉద్దేశ్యంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులోనూ పెద్ద ఎత్తున నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు.

వైద్య శిబిరం విజయవంతం



మాట్లాడుతున్న ఎంపీ రామచంద్రారెడ్డి

కడప కల్చరల్ : ప్రపంచ పక్షవాత నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సాయి బాబా హైస్కూల్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎంవీ.రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పక్షవాతం తదితర వ్యాధులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నవీన్ న్యూరో కేర్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ నవీన్ ప్రసాద్ మాట్లాడుతూ పక్షవాతం రాకుండా చూసుకోవాల్సిన జాగ్రత్తలు, వచ్చిన అనంతరం తీసుకోవాల్సిన చికిత్స గురించి అవగాహన కల్పించారు. బీపీ, షుగర్, కొలస్ట్రాల్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి చికిత్స అందజేశారు.

ప్రజాశాంతికి భంగం కలిగిస్తే చర్యలు

కడప డీఎస్పీ ఎండీ.షరీఫ్

కడప అర్బన్: కడప నగరంలోని యాకుబ్ సాహెబ్ మసీదు స్థలం విషయంలో వ్యక్తిగత దూషణలకు పాల్పడుతూ ప్రజాశాంతికి భంగం కలిగించేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కడప డీఎస్పీ ఎండీ.షరీఫ్ ఓ ప్రకటనలో హెచ్చరించారు. ప్రజలు ఎవరైనా తమ విజ్ఞప్తులను రాజకీయ నాయకులు, జిల్లా అధికారులకు ఇవ్వాలని సూచించారు. వ్యక్తిగత దూషణలకు పాల్పడటం మంచిది కాదని, అభిప్రాయాలు తెలియజేసే హక్కు చట్ట పరిధిలో వుండాలన్నారు. తప్పుడు సమాచారం వ్యాప్తి చేసి అలజడి సృష్టించే కుట్ర చేస్తున్న వారిపై జిల్లా అధికారులు సీరియస్‌గా వున్నారన్నారు. అలాంటి వారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

రోగులకు రొట్టెల పంపిణీ

కడప కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ తనయుడు ఫవాజ్ ఖాన్ జన్మదినం సందర్భంగా రోగులకు ఆదివారం అన్నదానం చేశారు. స్థానిక రవీంద్రనగర్‌లో వైఎస్సార్‌సీపీ నాయకుడు హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కోసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేసి, అన్నదానం చేశారు. కార్యక్రమంలో ముస్తఫా, పూరీ, సదాత్, మా బాషా, షర్ఫుద్దీన్, జవాద్, వెంకటేష్, అలీ, రబ్బానీ, షబ్బీర్, సొహైల్, జిలాన్, ఇమ్రాన్, పాల్గొన్నారు.

రహదారుల విస్తరణ

కడప కార్పొరేషన్: కడప నగరంలోని క్రిష్ణా థియేటర్- అన్నమయ్య విగ్రహం మార్గం విస్తరణ పనులను నగరపాలక సంస్థ, రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, ఆర్‌అండ్‌బీ, పోలీసులు అధికారులు ఆదివారం చేపట్టారు. స్థలాలు, ఇళ్లు, దుకాణాలు కోల్పోయే వారికి నష్టపరిహారం ఇచ్చిన నేపథ్యంలో ఆదివారం స్పెషల్ డ్రైవ్ చేపట్టి కట్టడాలను తొలగించారు.

వ్యాయామంతో ఆర్థరైటీస్‌కు చెక్

- నిర్లక్ష్యం వహిస్తే కీళ్లకు అరుగుదల ముప్పు
- రిమ్స్‌కు ప్రతిరోజు 50–70 బాధితుల రాక



కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్థరైటిస్‌తో బాధపడే వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. రిమ్స్ ఆస్పత్రి ఓపీకి బాధితులు అధికంగా వస్తుండడం ఇందుకు అద్దం పడుతోంది. కచ్చితమైన కారణం తెలియని ఆటో ఇమ్యూన్ వ్యాధి ఆర్థరైటీస్. కీళ్లు అరిగిపోవడంతో ట్రాన్స్ ప్లాంటేషన్‌కు దారి తీస్తుందని మరోవైపు వైద్యులు హెచ్చరిస్తున్నారు.

కడప రిమ్స్ ఆస్పత్రికి 50–70 మంది నిత్యం అర్థరైటీస్ బాధితులు వస్తున్నారు. వారిలో ఎక్కువగా వయసు రీత్యా వచ్చే ఆర్థరైటీస్ ఉన్న వారు క్రమం తప్పకుండా మందులు వాడడం, వ్యాయామం, ఆహార నియమాలు పాటిస్తే నయమవుతుందని వైద్య నిపుణులు చెబుతున్నా.. చాలామంది ఆసక్తి చూపడం లేదు. పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవడంతో అదుపులో ఉంచుకోవచ్చునని హెచ్చరిస్తున్నా.. చాలా మంది చొరవ చూపడం లేదు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు వచ్చే ఆర్థరైటీస్ రోగుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది.

తొలి దశలోనే గుర్తించాలి

ఆర్థరైటీస్‌ను తొలి దశలో గుర్తిస్తే కీళ్ల అరుగుదలకు దారి తీయకుండా అదుపులో ఉంచవచ్చు. 45 సంవత్సరాల వయస్సు దాటిన వారిలో ఆస్టియో, ఆర్థరైటీస్ వస్తోంది. రుమటాయిడ్, ఆర్థటైటీస్ ఏ వయస్సులో వారికైనా రావచ్చు. వీటితోపాటు గౌట్, సోరియాసిస్, ఆర్థటైటీస్, స్పాండేలో ఆర్థరైటీస్‌లో, లూపస్ వంటి 12 రకాల వ్యాధులు సోకుతుంటాయి. తొలి దశలో గుర్తించి మందులు వాడితే దానిద్వారా వచ్చే దుష్ఫలితాలను నివారించవచ్చు. లేకుంటే లూపస్ వంటివి గుండె, కిడ్నీలపై ప్రభావం చూపి ప్రాణాంతకంగా మారే ప్రమాదముంది.

ఎవరికి రావచ్చంటే

థైరాయిడ్ ఉన్న వారికి, అబార్షన్ అయిన మహిళలకు ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. 20–40 ఏళ్ల మహిళలకు ఆర్థరైటీస్ రావచ్చు. ఏ రకమైన వ్యాధి సోకిందో తెలుసుకుని అందుకు అనుగుణంగా మందులు వాడాలి. 45 సంవత్సరాలు దాటిని వారికి అర్థియో ఆర్థరైటీస్ సాధారణంగా వస్తుంది.

సకాలంలో మందులు వాడాలి



ఆర్థోపెడిక్ విభాగానికి ఎక్కువమంది రుమటాయిడ్ ఆర్థరైటీస్ రోగులు కూడా వస్తుంటారు. వారు కీళ్లు అరిగిన వారు ఉండడంతో కేసులు బాగా పెరిగాయి. కీళ్లు అరిగిపోవడంతో రీ ప్లేస్‌మెంట్ చేయించుకోవాల్సిన పరిస్థితి వస్తోంది. సకాలంలో గుర్తించి మందులు వాడాలి. బరువు అధికంగా లేకుండా పౌష్టికాహారం తీసుకుని వ్యాయామం చేయడంతో నివారించవచ్చు.

– డాక్టర్ ఎల్.ఆనంద్, ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు, రిమ్స్, కడప

8న విద్యా సంస్థల బంద్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్ఎస్‌యూ నాయకులు

వైవీయూ : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేయవద్దని, కడపలో మరో పరిశ్రమ ఏర్పాటుచేయాలని కోరుతూ నవంబర్ 8న చేపట్టిన విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి కోరారు. కడప నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాల ఆవరణంలో రెవల్యూషనరీ స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో బంద్‌కు సంబంధించిన పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు పరిశ్రమను మూసివేయాలనుకోవడం దారుణమన్నారు. అదే విధంగా విభజన చట్టంలో పేర్కొన్న విధంగా కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుచేయాలని కోరారు. ప్రజా సంఘాల ఆధర్యంలో విజయవాడ కేంద్రంగా చేపట్టిన విశాఖ ఉక్కు పోరాటం నవంబర్ 8వ తేదీన 1000 రోజులకు చేరుకున్న సందర్భంగా కేజీ టు పీజీ విద్యా సంస్థల బంద్ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్, హరి, ప్రమోద్, కిరణ్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

కడప వైఎస్ఆర్ సర్కిల్: విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణకు నవంబరు 8న విద్యా సంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు విద్యార్థి, యువజన సంఘాల ప్రతినిధులు శివారెడ్డి, అంకన్న, రాజేంద్ర, శివకుమార్ తెలిపారు. నగరంలోని ఎస్టీయూ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థి యువజన రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం పూర్తి చేయాలని, విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటు పరం చేయవద్దని తెలిపారు. విద్యార్థుల జీవితాలను చీకటి రోజుల్లోకి నెట్టేస్తున్నారన్నారు. నవంబర్ 8న జరిగే విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, నాయకులు పాల్గొన్నారు.

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం సభ్యులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఏపీఎస్సార్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఈయూ యూనియన్ ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, ఏపీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు కేకే కుమార్, రీజినల్ సెక్రటరీ అంకిరెడ్డి, ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి మద్దిలేటి డిమాండ్ చేశారు.

స్థానిక ఈయూ కార్యాలయంలో కార్మికులతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆర్టీసీలో ఔట్ సోర్సింగ్ కింద పనిచేస్తున్న వారిని ఆప్కాస్‌లో విలీనం చేయాలని కోరారు. అనంతరం యూనియన్ నూతన జిల్లా అధ్యక్షుడిగా నాగసుబ్బారెడ్డి, కార్యదర్శులుగా విజయ్, స్టీఫెన్, సుబ్బరాయుడు, శ్రీనివాసులు, ప్రభావతి, శివప్రసాద్‌లను ఎన్నుకున్నారు.

బెటాలియన్‌ను సందర్శించిన జడ్జి



మాట్లాడుతున్న సిద్దవటం జడ్జి శ్రీనివాసకళ్యాణ్

సిద్దవటం : సిద్దవటం కోర్టు జడ్జి శ్రీనివాస కళ్యాణ్ ఆదివారం ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పోలీసుల అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీసుల నిస్వార్థ సేవలు, వారి త్యాగాల అంశాలపై ప్రసంగించారు. అనంతరం జడ్జిని అడిషనల్ కమాండెంటు కె.ప్రభు కుమార్‌కు మెమెంటోను ప్రదానం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంటు కె. ప్రభుకుమార్, అసిస్టెంటు కమాండెంట్లు వి.కేశవరెడ్డి, కె.వెంకటరెడ్డి, వి.జయప్రసాద్‌రెడ్డి, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : కొత్తపేట–బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలను, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి సురేష్ కుమార్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో బంధుమిత్రులతో విందుభోజనాలను చేశారు. ఆలయ సమీపంలోని ఆలయాలలో పూజలు నిర్వహించారు.

విరివిగా ఉచిత కంటి వైద్య శిబిరాలు



కంటి వైద్య శిబిరంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

రాజంపేట రూరల్ : ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి పేదలకు కంటి చూపునివ్వడాన్ని తన అదృష్టంగా భావిస్తున్నట్లు జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి తెలియజేశారు. మండల పరిధిలోని ఆకేపాడులోని ఆకేపాటి ఎస్టేట్‌లో ఆదివారం ఆకేపాటి ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర నేత్రాలయ కంటి వైద్యశాల సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముందుగా వైద్య శిబిరాన్ని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. శంకర నేత్రాలయ సిబ్బంది నిర్వహిస్తున్న కంటి పరీక్షలను ఆకేపాటి పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ ఆకేపాటి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి కంటి చూపు ఇవ్వాలనేది తమ లక్ష్యమని తెలియజేశారు. కంటిచూపు లేని వారు మన ఉమ్మడి జిల్లాలలో ఉండకుండా చేసేందుకే విరివిగా ఉచిత కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఆకేపాటి అనీల్‌కుమార్‌రెడ్డి, నాయకులు బి.రామ్మోహన్ నాయుడు, పి.విశ్వనాథరెడ్డి, పోలి మురళీరెడ్డి, జీవీ సుబ్బరాజు, జి.మల్లికార్జునరెడ్డి, ఎస్.శ్రీనివాసులు, కె.శ్రీహరి, శంకర నేత్రాలయ వైద్యులు వి.మురళీకృష్ణ, వి.షణ్ముగం, పిల్లి జయప్రకాష్, ప్రజలు పాల్గొన్నారు. కాగా ఈ శిబిరంలో 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో మొదటి విడతగా 35 మంది కంటి ఆపరేషన్ల నిమిత్తం ఆస్పత్రికి పంపించారు.

అలరించిన ఆటాపాటా



చిన్నారుల నృత్య ప్రదర్శన

కడప కల్చరల్: ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా కడప శిల్పారామంలో చిన్నారుల ఆటాపాటా అందరినీ అలరించింది. పాటలకు చిందులు వేస్తూ చేసిన నృత్య ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. కడప నగరానికి చెందిన కిశోర్ డ్యాన్స్ అకాడమీ చిన్నారులు ఈ సందర్భంగా ప్రముఖ సినీ గీతాలతోపాటు శాస్త్రీయ నృత్యాలు ప్రదర్శించారు. ప్రేక్షకులు పదేపదే కరతాళ ధ్వనులు చేసి వారిని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో శిల్పారామం ఏఓ పి.శివప్రసాద్‌రెడ్డి పాల్గొని పర్యవేక్షించారు.

పొన్నవోలు గంగమ్మ ఆలయంలో చోరీ

సిద్దవటం : మండలంలోని పొన్నవోలు గ్రామంలోని గంగమ్మ గుడిలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ లక్ష్మినారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ పొన్నవోలు గంగమ్మ గుడిలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గుడిలోని హుండీని పగులగొట్టి అందులో ఉన్న దాదాపు రూ. 40వేలు నగదును దొంగలించారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు ఎమ్మెల్యే రాక

వీరపునాయునిపల్లె : మండలంలోని పాయసంపల్లెలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని సోమవారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి ప్రారంభిస్తారని మండల అధ్యక్షుడు కల్లూరు రఘునాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం 11 గంటలకు వీరపునాయునిపల్లెలో రైతు భరోసా కేంద్రం, మరమ్మతులు చెపట్టిన ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆయన ప్రారంభిస్తారన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్

వైవీయూ: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.శ్రావణ్‌కుమార్ డిమాండ్ చేశారు. కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో ఆపస్ జిల్లా కార్యనిర్వాహక వర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫేషియల్ అటెండెన్స్‌లో గ్రేస్ పీరియడ్ తొలగించడం, సకాలంలో వేయలేదని మెమోలు జారీచేయడం సరికాదన్నారు. ఆపస్ జిల్లా అధ్యక్షుడు పి.వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులందరికీ పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ప్రధాన కార్యదర్శి ఎస్.చెన్నయ్య మాట్లాడుతూ 11వ పీఆర్‌సీ బకాయిలు, కరవు భత్యం బకాయిలు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షుడు ఎస్.రామ్మోహన్‌రెడ్డి, జి.వి.సత్యనారాయణ, రామాంజనేయప్రసాద్ తదితరులు మాట్లాడారు. అనంతరం దాదాపు 50 మంది ఆపస్ సంఘంలో చేరినట్లు జిల్లా ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.కొండారెడ్డి, ఆర్.వి.జనార్ధన్‌రెడ్డి, సుబ్బరాయుడు, ఎరుకలరెడ్డి, బాలనాయుడు, సుధాకర్‌రెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాసులు, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి



ఎస్ఐ రంగస్వామికి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

కడప కార్పొరేషన్: ఉప ముఖ్యమంత్రి అంజద్ బాషాపై దుష్ప్రచారం చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, నాయకులు తోటక్రిష్ణ, దేవిరెడ్డి ఆదిత్య, అరీఫుల్లా బాషా, షఫీ, అహమ్మద్, కమాల్‌బాషా, అజ్మతుల్లా కోరారు. ఆదివారం రాత్రి వన్‌టౌన్ ఎస్ఐ రంగస్వామిని కలిసి వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో భాగంగా యాకుబ్‌సాబ్ మసీదు ప్రక్కన కాంప్లెక్స్‌ను తొలగిస్తుంటే...ఆ మసీదునే తొలగిస్తున్నట్లుగా కొందరు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి ముస్లింలను రెచ్చగొడుతున్నారన్నారు. డిప్యూటీ సీఎం వ్యక్తిత్వాన్ని తగ్గిస్తూ వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు పెడుతున్నారన్నారు. అంజద్‌బాషా ఫ్లెక్సీని మసీదు గేటు వద్ద ఉంచి దాన్ని తొక్కుకుంటూ వెళ్లాలని చెప్పడం దారుణమన్నారు. ఈ ఘటనకు పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాలలకూ ఆధ్యాత్మిక విద్య అవసరం

కడప కల్చరల్: ఆధ్యాత్మిక విద్య నేర్చుకుంటే బాలల్లో నైతిక విలువలు పెంపొందుతాయని కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ముక్తార్ అహ్మద్ అన్నారు. కడప నగరంలోని కేంద్ర కారాగారం వద్ద గల మదరసా ఉస్మాన్ బిన్ అఫాన్ మైదానంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ విద్యతోపాటు నేటితరం బాలలకు ఆధ్యాత్మిక విద్య అవసరమన్నారు. అనంతరం సీరతున్నబీ పోటీ పరీక్షల్లో విజేతలైన విద్యార్థులకు అతిథులు బహుమతులు అందజేశారు. ఈ శిబిరంలో స్థానిక ప్రైమ్ ఆస్పత్రి సిబ్బంది, వైద్యులు పాల్గొని బీపీ, షుగర్, యూరిన్, రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు మజ్లిస్–యే–ఉలేమా అయిమా సంస్థ అధ్యక్షుడు మౌలానా జుబేర్ అహ్మద్‌ఖాన్ రషాది, బీమవరం మక్కా ఇస్లామిక్ ట్రస్టు ప్రధాన కార్యదర్శి మహమ్మద్ సిద్దిఖ్, స్థానిక ప్రముఖులు నజీర్ అహ్మద్, అఫ్జల్‌ఖాన్, ముస్లిం ప్రముఖులు, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

వినియోగదారులపై వసూళ్ల భారం తగదు

కడప సెవెన్‌రోడ్స్: గృహ వినియోగదారులపై అదనపు విద్యుత్తు ఛార్జీలు వసూలు చేస్తూ భారం మోపడం తగదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పి.మల్లికార్జున ఓ ప్రకటనలో తెలిపారు. కడప నగరంలోని పేదల కాలనీల్లో అదనంగా బిల్లులు వసూలు చేస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. గత మూడు నెలలుగా ఈ వ్యవహారం కొనసాగుతోందని తెలిపారు. ఇప్పటికే ఫిక్స్‌డ్ ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు, విద్యుత్ డ్యూటీ, ట్రూఅప్ ఛార్జీలు, ఇంధన సర్దుబాటు ఛార్జీలు వసూలు చేస్తున్నారని వివరించారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేకపోయినా స్థానిక విద్యుత్ అధికారులు అదనపు ఛార్జీలు వసూలు చేస్తుండడంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా అదనపు ఛార్జీల వసూలు ఆపివేయాలని కోరారు.

పెంచిన విద్యుత్తు చార్జీలపై ఉద్యమిస్తాం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : విద్యుత్తు చార్జీలు తగ్గించేంత వరకు ఉద్యమిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన క్షేత్ర స్థాయి ఉద్యమంలో భాగంగా సచివాలయాల వద్ద ఆందోళన చేపట్టాలని పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే విద్యుత్తు చార్జీలను పెంచబోమని, వ్యవసాయానికి, గృహ అవసరాలకు, పారిశ్రామిక రంగానికి నాణ్యమైన విద్యుత్తు అందిస్తామని పదేపదే హామీ ఇచ్చారన్నారు. అధికారం చేపట్టిన నాలుగేళ్లలో సర్‌చార్జీలు, సర్దుబాటు చార్జీలు, ట్రూఅప్ చార్జీలు, మరిన్ని పేర్లతో అసాధారణ భారం వేస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ రంగ ప్రైవేటీకరణను విరమించాలన్నారు. ఇదుకోసం ప్రజలతో సంతకాలు చేయించి గ్రామ, వార్డు సచివాలయాల ఆందోళన ద్వారా ముఖ్యమంత్రికి వినతి పత్రాలు పంపనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సి.సుబ్రహ్మణ్యం కే.సి.బాదుల్లా జిల్లా సమితి సభ్యుడు మనోహర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి అమానుషం





ఆర్టీసీ బస్టాండు ఆవరణలో ఉద్యోగుల నిరసన, నల్లబ్యాడ్జీలతో ఆందోళన చేస్తున్న ఎన్ఎంయూ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్: రౌడీ మూకలు చెలరేగి విధుల్లో ఉన్న ఆర్టీసీ డ్రైవర్ రాంసింగ్‌పై అమానుషంగా దాడి చేయడం పాశవిక చర్య అని ఆర్టీసీ ఉద్యోగులు ఆరోపించారు. కడప ఆర్టీసీ బస్టాండులో ఆదివారం గేట్ మీటింగ్ నిర్వహించారు. వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాబా ఫక్రుద్దీన్, ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య, జోనల్ అధ్యక్షుడు కేకే.కుమార్, కార్మిక పరిషత్ రీజినల్ కార్యదర్శి పురుషోత్తం మాట్లాడుతూ విజయవాడ డిపోకు చెందిన డ్రైవర్‌పై మద్దూరుపాడు వద్ద హైవేలో యువకులు చితకబాదడం విచారకరమన్నారు. ప్రయాణీకులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చే తమపై ఇలాంటి దాడులను ప్రజలంతా ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు నాగసుబ్బారెడ్డి, బాదుల్లా, మద్దిలేటి, ఈయూ కడప డిపో అధ్యక్ష, కార్యదర్శులు రాము, బాల వెంకటేశ్, గ్యారేజీ కార్యదర్శి ఎంఎస్ రెడ్డి, కడప రీజియన్ కార్యదర్శి అంకిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

విజయవాడ ఆర్టీసీ డ్రైవర్‌పై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఎన్ఎంయూ డిపో అధ్యక్ష, కార్యదర్శులు జయరాం, సగినాల శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శులు మున్నా, రహమతుల్లా, హరిప్రసాద్, సుబ్బయ్య నాయకులు కోరారు. స్థానిక బస్టాండు ఆవరణలో నల్లబ్యాడ్జీలతో వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్ బత్తుల రాంసింగ్‌పై విచక్షణా రహితంగా దాడి చేశారన్నారు. రేయింబవళ్లు విధులు నిర్వర్తిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులపై దౌర్జన్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని నిరూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


అధ్యయన కేంద్రం తనిఖీ

మైదుకూరు : మైదుకూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్ తరగతులను ఆదివారం రాష్ట్ర సమన్వయకర్త ఎస్.అక్బర్ ఆలీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాలను తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఓపెన్ స్కూల్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. రెగ్యులర్ విద్యార్థులతోపాటు ఓపెన్ స్కూల్‌లో చదివిన వారికి అన్ని అవకాశాలు ఉంటాయని తెలిపారు.

నవంబర్ 3న మృత్యుంజయ హోమం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో నవంబర్ 3న మృత్యుంజయ హోమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజున ఉదయం అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేయనున్నామని తెలిపారు.

ప్రతి ఒక్కరూ భగవద్గీత చదవాలి



మాట్లాడుతున్న శివదర్శనానంద సరస్వతీ మాతాజీ

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రతి ఒక్కరూ భగవద్గీత చదవాలని శివదర్శనానంద సరస్వతి మాతాజీ పేర్కొన్నారు. స్థానిక శివదర్శనానంద మాతాజీ ఆశ్రమంలో విద్యార్థులకు ఆదివారం భగవద్గీత పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భగవద్గీత చదవడంతో మంచి, చెడు తెలుస్తాయన్నారు. మండల స్థాయి పోటీలలో ఐదు కేటగిరీల్లో నిర్వహించిన ఈ పోటీల్లో ఎ–కేటగిరిలో సాత్వికారెడ్డి (సాయిరవీంద్ర), బి–కేటగిరిలో పర్వేష్(సరోజిని), సి–కేటగిరిలో అక్షయ (శ్రీ రవీంద్రహైస్కూల్), డి–కేటగిరిలో వీరషణ్ముఖ ఆచారి(బాల సత్‌సంఘం), ఈ–కేటగిరిలో విశాలాక్షి (ఆదిత్య) విజేతలుగా నిలిచారు. ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేల్లేటి ప్రభాకర రెడ్డి, డాక్టర్ మూలే రామమునిరెడ్డి పాల్గొన్నారు.

భర్త, బంధువులపై వేధింపుల కేసు నమోదు

కడప అర్బన్: తనను వేధిస్తున్నారంటూ ఓ మహిళ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుపతికి చెందిన తన భర్త నాయబ్ మౌలీబాషాతోపాటు అతని తల్లి నూర్జహా, ఆమె భర్త మక్బుల్‌బాషా, భర్త సోదరుడు నాయబ్ సమీర్‌బాషలు వరకట్న వేధింపులకు పాల్పడుతున్నారని కడప నగరంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బిస్మిల్లా నగర్, అల్మాస్‌పేట ప్రాంతంలో నివాసం వుంటున్న షేక్ రిహనూమా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆదివారం రాత్రి కడప టూటౌన్ ఎస్ఐ జయరాం మొత్తం నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.